

బక్కరవీందర్
ఎడిటర్
సెల్: 8501919707

తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT








సంపుటి: 1 సంచిక: 141 పేజీలు: 4 ఎడిటర్ : బక్కరవీందర్ ప్రచురణ: హైదరాబాద్ బుధవారం 25 -12-2024 వెల: 5/రూ -




## ఒడిశా గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు

- మిజోరాంకు జనరల్ వీకే సింగ్
- 5 రాష్ట్రాలకు కొత్త గవర్నర్ల నియామకం

2లో

# తప్పయిపోయింది!

## చిక్కడపల్లి ఠాణాలో అల్లు అర్జున్ భావోద్వేగం!.. తొక్కిసలాట దృశ్యాలు చూసి చలించిన బన్నీ

- అతడి తరఫు న్యాయవాది సమక్షంలో విచారణ
- ఉదయం 11:05 నుంచి మధ్యాహ్నం 2:45 దాకా..
- సినిమాకి నేరుగా వెళ్లక రోడ్‌షో ఎందుకు చేశారు?
- అనుమతి లేనిదే రోడ్ షో చేయడం తప్పని తెలీదా?
- రేవతి చనిపోయిన విషయం మీకెప్పుడు తెలిసింది?
- వెళ్లిపోవాలని ఏసీపీ చెప్పినా.. ఎందుకు వెళ్లలేదు?
- దర్యాప్తు జరుగుతుండగా ప్రెస్‌మీట్ ఎలా పెట్టారు?
- 20 ప్రశ్నలు..! ఒకట్రెండు తప్ప అన్నింటికీ జవాబు
- ఎప్పుడు పిలిచినా విచారణకు వస్తానని స్పష్టీకరణ
- మూడుసార్లు విరామం.. బన్నీకి టీ ఇచ్చిన పోలీసులు
- ఠాణా వద్దకు భారీగా అభిమానులు.. స్వల్పఉద్రిక్తత



హైదరాబాద్: 'తగ్గేదే లే' అని సినిమాలో డైలాగులు చెప్పిన నటుడు అల్లు అర్జున్.. నిజ జీవితంలో పోలీసుల విచారణలో కాస్తంత వెనక్కి తగ్గారా? తప్పు ఒప్పుకొని కంటతడి కూడా పెట్టారా? అంటే.. పోలీసు వర్గాలు ఇందుకు ఔననే సమాధానమే ఇస్తున్నాయి. ఆ వర్గాలు చెబుతున్నదాని ప్రకారం.. సంధ్య థియేటర్ వద్ద జరిగిన దుర్ఘటనకు తాను కారణం కాదని ఇన్నిరోజులుగా చెబుతున్న బన్నీ.. తనవల్ల పెద్ద తప్పు జరిగిపోయిందంటూ మంగళవారం పోలీసుల వద్ద విచారం వ్యక్తం చేశారు! తోపులాటలో కిందపడి అపస్మారకస్థితిలోకి వెళ్లిన రేవతి, శ్రీతేజ్‌ను బతికించడం కోసం పోలీసులు సీపీఆర్ చేసిన వీడియోని చూసి ఆయన కంటతడి పెట్టుకున్నారు!! తొక్కిసలాటకు సంబంధించి పోలీసులు చూపిన 10 నిమిషాల వీడియో చూసి ఆయన భావోద్వేగానికి గురైనట్టు సమాచారం. 'పుష్ప-2' ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసుకు సంబంధించి విచారణకు



2లో

## కేసీఆర్, హరీశ్‌కు హైకోర్టులో ఊరట


**భూపాలపల్లి కోర్టు నోటీసుల సస్పెన్షన్**
**జిల్లా కోర్టు పరిధి మీరిందన్న హైకోర్టు**
**మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు వ్యవహారం**

హైదరాబాద్,: మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు జారీ చేసిన నోటీసులను హైకోర్టు సస్పెండ్ చేసింది. జిల్లా కోర్టు తన అధికార పరిధిని మీరి వ్యవహరించిందని పేర్కొంది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు

## సంక్రాంతికి 'సహకార' పోస్టుల భర్తీ!

- వ్యవసాయ మార్కెట్ కమిటీల పదవులు కూడా..
- ఏఎంసీ చైర్మన్ పదవుల్లో సగం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు
- క్షేత్ర స్థాయిలో 10 వేల పదవులు దక్కే అవకాశం
- కూటమి నేతలకు కొత్త సంవత్సరం బహుమతి

అమరావతి: రాష్ట్రంలో కూటమి పార్టీల నేతలకు కొత్త సంవత్సరం ఆరంభంలోనే నామినేటెడ్ పదవుల బహుమతి లభించనుంది. సహకార సంస్థలు, మార్కెట్ కమిటీల పదవులను జనవరిలో భర్తీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ దాదాపు 10వేల పదవులు క్షేత్రస్థాయి నేతలకు దక్కనున్నాయి. వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేలోపు వాటికి నామినేటెడ్ పాలక వర్గాలను నియమించాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 2,300 వ్యవసాయ సహకార సొసైటీలు ఉన్నాయి. వీటిలో ఒక్కోదానికి చైర్మన్‌తో పాటు ఇద్దరు సభ్యులను నామినేట్ చేయడం ద్వారా



## త్వరలో రూ.400 కోట్లు విడుదల

- మా ప్రభుత్వం వచ్చేనాటికి గ్రామ పంచాయతీలకు ఉన్న బకాయిలు రూ. 1,300 కోట్లు: భట్టి
- బిల్లులు పెండింగ్‌లో పెట్టిన బీఆర్ఎస్ నేతలు
- ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని వ్యాఖ్య



హైదరాబాద్: గ్రామ పంచాయతీల్లో అప్పులు చేసి అభివృద్ధి పనులు చేసిన అప్పటి సర్పంచులకు త్వరలోనే రూ.400 కోట్లు విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. గత ప్రభుత్వం వారితో అభివృద్ధి పనులు చేయించి.. నిధులు విడుదల చేయకుండా వారిని రోడ్డుపై వదిలేసిందని మండిపడ్డారు. అందువల్ల పంచాయతీ బకాయిలపై బీఆర్ఎస్ నాయకులు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని

# మరపురాని రాజనీతిజ్ఞుడు

నైతిక విలువలకు కట్టుబడిన రాజకీయం.. పార్టీలకు అతీతమైన రాజనీతిజ్ఞత.. పార్లమెంటులో ఎంపీలనే కాదు.. విద్యారంగ సదస్సుల్లో విద్యావేత్తల్ని, బహిరంగ సభల్లో సామాన్య ప్రజల్ని సైతం సమ్మోహితుల్ని చేసే ఉపన్యాస ఝరి, భిన్నత్వంలో ఏకత్వమనే భారతీయ వారసత్వ సంపదే ఈ దేశం ఆత్మ అనే తాత్విక అవగాహన.. ఇవన్నీ కలిపితే అటల్ బిహారీ వాజపేయి అవుతారు. రాజకీయ పార్టీల, సిద్ధాంతాల సరిహద్దులకు అతీతంగా గౌరవాభిమానాల్ని పొందిన అజాతశత్రువు ఆయన. వాజపేయి శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో ఆయన జీవితంలో స్ఫూర్తినిచ్చే ఘట్టాల అవలోకనం.

- మూడుసార్లు ప్రధానిగా దేశ సారథ్యం
- అనైతిక పద్ధతుల్లో అధికారం వద్దన్న నైతికత.. ఐదేళ్లు తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం
- రక్షణరంగం బలోపేతానికి పోఖ్రాన్
- పాక్‌తో మైత్రికి లాహోర్ బస్సు యాత్ర
- కార్గిల్ యుద్ధంతో పాక్‌కు గుణపాఠం

వాజపేయి దేశ ప్రధానిగా మూడు పర్యాయాలు బాధ్యతలు నిర్వర్తించారు. తొలిసారి కేవలం 13 రోజులే ఆ పదవిలో ఉండగా, రెండోదఫాలో 13 నెలలపాటు అధికారంలో ఉండటం విశేషం. మూడోసారి మాత్రం పూర్తి కాలంపాటు ప్రధాని పదవిలో కొనసాగారు. 1996లో జరిగిన సాధారణ ఎన్నికల



2లో

# సంక్రాంతికి 'సహకార' పోస్టుల భర్తీ!

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 6,900 మందికి అవకాశం లభించనుంది. వీటిలో ప్రత్యేకించి రిజర్వేషన్లు లేకపోయినా స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సామాజిక న్యాయం పాటించాలని సర్కారు సూచించింది. ఎమ్మెల్యేలు ఇచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి ఖరారు చేసే బాధ్యతను ఇన్‌చార్జి మంత్రులకు అప్పగించారు. సంక్రాంతి నాటికి ఈ పదవులు భర్తీ చేయాలన్న యోచనలో ఉన్నారు. రెండోదశలో జిల్లా సహకార బ్యాంకులు, జిల్లా మార్కెటింగ్ సంస్థలకు కూడా ముగ్గురు సభ్యుల పాలక వర్గాలను నియమిస్తారు. తర్వాత రాష్ట్ర సహకార బ్యాంకు పాలక మండలిని ఖరారు చేసి నామినేట్ చేస్తారు. జిల్లా స్థాయి పదవులు ఆశిస్తున్న నేతలు ఇప్పటికే తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు. సహకార సంస్థల్లో వ్యవసాయేతర సంఘాల పదవులు కూడా భర్తీచేసే యోచనలో ప్రభుత్వం ఉంది. వందల సంఖ్యలో మత్స్యకార సొసైటీలకు కూడా నామినేటెడ్ పాలక వర్గాలు నియమించే కసరత్తును సహకార శాఖ చేపట్టింది. వీటినీ జనవరిలోనే భర్తీ చేసే అవకాశం ఉంది. గొర్రెల పెంపకందారుల సొసైటీల పాలక వర్గాల నియామకంపైనా ప్రతిపాదనలు స్వీకరిస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలక వర్గాల నియామక కసరత్తు ప్రభుత్వ స్థాయిలో జరుగుతోంది. వీటికి ఎన్నికలు ఉండవు. రెండేళ్ల కాల పరిమితితో నామినేటెడ్ పాలక వర్గాలను నియమిస్తారు. రాష్ట్రంలో 222 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఒక్కో కమిటీలో ఛైర్మన్‌తో కలిపి 15 మంది సభ్యులను నియమిస్తారు. ఈ కమిటీల చైర్మన్ పదవుల్లో సగం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు రిజర్వు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రొటేషన్‌లో భాగంగా రెండేళ్ల తర్వాత ఇప్పుడు రిజర్వేషన్‌లో ఉన్న చైర్మన్ పదవులు జనరల్ అవుతాయి. ఇప్పుడు జనరల్‌లో ఉన్నవి రిజర్వేషన్‌లోకి వస్తాయి.

# త్వరలో రూ.400 కోట్లు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

హితవు పలికారు. రూ.10 లక్షలలోపు పెండింగ్‌లో ఉన్న ప్రజాప్రతినిధుల బిల్లులు దాదాపు రూ.400 కోట్లు ఉంటాయని అంచనా వేశామని, వాటిని త్వరలోనే విడుదల చేస్తామని మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో భట్టి చెప్పారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు వంటి ప్రజాప్రతినిధులు చేసిన అభివృద్ధి కార్యక్రమాల పెండింగ్ బిల్లులు గత సంవత్సరం డిసెంబర్ 7 నాటికి ఉన్న బకాయిలు రూ.1,300 కోట్లు అని వెల్లడించారు. సర్పంచులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు పడుతున్న ఇబ్బందులను సీఎం రేవంత్‌రెడ్డి, తాను గమనించి రూ.10 లక్షల లోపు ఉన్న బకాయిలను త్వరలోనే విడుదల చేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు చెప్పారు. ప్రజా ప్రతినిధుల ఇబ్బందులకు కారణమైన బీఆర్ఎస్ నేతలు పెండింగ్ బిల్లుల కోసం ధర్నాలు చేస్తామని ప్రకటించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.

**పంట పొలాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లు**

ప్రధాన మంత్రి కిసాన్ ఊర్జా సురక్షా ఏవం ఉత్థాన్ మహాభియాన్ పథకం కింద రాష్ట్రంలో రైతుల పంట పొలాల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. 0.5%-% 2 మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ ప్లాంట్లను ఎండిపోయిన, పాడుబడిన వ్యవసాయ భూముల్లో రైతులతో ఏర్పాటు చేయిస్తామన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసే విద్యుత్‌కు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు యూనిట్‌కు రూ.3.13 చొప్పున ధర చెల్లిస్తాయన్నారు. రైతులు, రైతు బృందాలు, సహకార సొసైటీలు, పంచాయతీలు, రైతు సంఘాలు, నీటి వినియోగ సంఘాలు ఈ పథకం కింద అర్హులన్నారు.

# ఒడిశా గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు

న్యూఢిల్లీ/:రాష్ట్రానికి చెందిన కంభంపాటి హరిబాబు ఒడిశా నూతన గవర్నర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన మిజోరాం గవర్నర్‌గా ఉన్నారు. ఐదు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఒడిశా గవర్నర్ పదవికి రఘుబర్ దాస్ చేసిన రాజీనామాను ఆమోదించిన రాష్ట్రపతి ఆయన స్థానంలో హరిబాబును నియమించారు. కేరళ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌ను బిహార్‌కు, బిహార్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కేరళకు బదిలీ చేశారు. మణిపూర్ గవర్నర్‌గా కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి అజయ్‌కుమార్ భల్లాను, మిజోరాం గవర్నర్‌గా జనరల్ విజయ్‌కుమార్ సింగ్‌ను నియమించారు. ఇటీవల అస్వస్థతకు గురైన హరిబాబును ప్రధాని మోదీ ఫోన్‌లో పరామర్శించినట్లు తెలిసింది. కాగా, ఒడిశా గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు నియమితులు కావడం సంతోషకరమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఆయన నియామకంతో ఏపీ, ఒడిశా సరిహద్దు సమస్యలతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి, ఇరు రాష్ట్రాల అభివృద్ధికి ఆస్కారం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# హైకోర్టులో కేసీఆర్, హరీశ్‌కు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ తదితరుల అవినీతే కారణమని పేర్కొంటూ నాగవెల్లి రాజలింగమూర్తి అనే వ్యక్తి మొదట భూపాలపల్లి మేజిస్ట్రేట్ కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు దాఖలు చేశారు. దాన్ని విచారించే పరిధి తమకు లేదంటూ ఆ కోర్టు తోసిపుచ్చింది. దీంతో ఫిర్యాదుదారు భూపాలపల్లి జిల్లా కోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించే అధికార పరిధి జిల్లా కం సెషన్స్ కోర్టుకు లేదని కోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం తెలిపింది. అయితే ఈ అభ్యంతరాలను పరిశీలించిన జిల్లా కోర్టు... పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తూ వివరణ ఇవ్వాలని కేసీఆర్, హరీశ్‌రావు, అప్పటి నీటిపారుదల శాఖ కార్యదర్శి రజత్‌కుమార్, అప్పటి సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు హరిరామ్, శ్రీధర్, మేఘా నిర్మాణ సంస్థ అధినేత కృష్ణారెడ్డి, ఎల్ అండ్ టీ సంస్థలకు నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కేసీఆర్, హరీశ్‌రావు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది టీవీ రమణారావు వాదిస్తూ సీఆర్పీసీకి విరుద్ధంగా రివిజన్ పిటిషన్‌ను జిల్లా కోర్టు స్వీకరించిందని తెలిపారు. జిల్లా కోర్టు జూలై 10న ఇచ్చిన ఆదేశాలను, నోటీసులను కొట్టేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఇది పిటిషనర్లకు ప్రైవేటు ఫిర్యాదుదారుకు మధ్య వ్యవహారమని, ఇందులో ప్రభుత్వ పాత్ర లేదని వ్యాఖ్యానించింది. రాజలింగమూర్తికి నోటీసులు జారీ చేస్తూ విచారణను జనవరి 7కు వాయిదా వేసింది.

# సీఎంను కలిసి మాట్లాడా

**శ్రీతేజ్ కుటుంబ బాధ్యత తీసుకోవడంపై చర్చించా**

**బాలుడి తండ్రికి పరిశ్రమలో ఉద్యోగమిస్తాం**

**సినిమా వాళ్లందరం వెళ్లి ముఖ్యమంత్రిని కలుస్తాం**

**శ్రీతేజ్‌ను పరామర్శించిన నిర్మాత దిల్ రాజు**




హైదరాబాద్: సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో గాయపడి ఆస్పత్రిలో ఉన్న శ్రీతేజ్ కుటుంబ బాధ్యతను తీసుకోవడంపై తాను సీఎంతో చర్చించానని.. ఆయన ఓకే అన్నారని, ఆయన ఆదేశాల మేరకు బాలుణ్ని పరామర్శించడానికి వచ్చానని ఎఫ్‌డీసీ చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు అన్నారు. అలాగే.. చిత్ర పరిశ్రమను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుందంటూ కొందరు మాట్లాడుతున్నారని, అందులో నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. "చిత్ర పరిశ్రమకు అన్ని రకాలుగా అండగా ఉంటామని, ఎఫ్‌డీసీ ద్వారా సహాయసహకారాలు అందిస్తామని సీఎం రేవంత్ చెప్పారు. ప్రభుత్వానికి, పరిశ్రమకు మధ్య అనుసంధానకర్తగా ఉంటూ ఎలాంటి సమస్యలూ లేకుండా చూసుకునే బాధ్యతను ముఖ్యమంత్రి నాకు అప్పగించారు. బుధవారం లేదా గురువారం సమయం ఇస్తానన్నారు. దీనిపై పలువురు సినీ పెద్దలతో మాట్లాడాను. ఇండస్ట్రీ తరఫున అందరం వెళ్లి సీఎంను కలుస్తాం" అని దిల్ రాజు వెల్లడించారు. కిమ్స్‌లో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను మంగళవారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. శ్రీతేజ్ కోలుకుంటున్నాడని.. అతడి ఆరోగ్యం మెరుగైనట్లు వైద్యులు చెప్పారని వెల్లడించారు. 'వెంటిలేటర్ తొలగించి రెండు రోజులైందట. ఆ తర్వాత కూడా రికవరీ కనిపిస్తోంది. కాబట్టి త్వరలోనే కోలుకుంటాడు" అని పేర్కొన్నారు. 'పుష్ప' ప్రీమియర్ షో సమయంలో జరిగిన సంఘటన దురదృష్టకరమని.. ఎవరూ కావాలని చేయరని ఆయన వ్యాఖ్యానించారు. తాను వేరే కార్యక్రమంలో పాల్గొనడానికి అమెరికాకు వెళ్లానని, తిరిగి రాగానే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని చెప్పారు. తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన రేవతి కుటుంబాన్ని సినీ పరిశ్రమ, ప్రభుత్వం కలిసి అన్ని రకాలుగా ఆదుకుంటాయని తెలిపారు. ఎఫ్‌డీసీ చైర్మన్‌గా ఆ బాధ్యతను సీఎం రేవంత్ రెడ్డి తనకు అప్పగించారని.. తానే ఆ పనులన్నీ చూసుకుంటానని వెల్లడించారు. 'అల్లు అర్జున్ ద్వారా కూడా వారి కుటుంబానికి అందాల్సిన సాయం అందుతుంది. ఇండస్ట్రీ పెద్దగా.. అల్లు అర్జున్‌ను కూడా కలిసి ఆయన స్పందన కూడా తెలియజేస్తాను. ఇండస్ట్రీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేస్తూ ఈ సమస్యలన్నీ త్వరలోనే సమసిపోయేందుకు కృషి చేస్తాను' అని దిల్ రాజు పేర్కొన్నారు. రేవతి భర్త భాస్కర్‌కు సినీ పరిశ్రమలో ఏదో ఒక ఉద్యోగం వచ్చే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా కూడా ఆ కుటుంబానికి వీలైనంత సహకారం అందిస్తామన్నారు.

# తప్పయిపోయింది!




(మొదటి పేజీ తరువాయి)

రావాలంటూ చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్‌కు నోటీసులిచ్చిన సంగతి తెలిసిందే. ఈమేరకు.. మంగళవారం ఉదయం 10.30 గంటలకు.. భార్య, కుమార్తె గేటుదాకా వచ్చి సాగనంపగా.. తండ్రి అల్లు అరవింద్, మామ చంద్రశేఖర్ రెడ్డి, బన్నీ వాసుతో కలిసి ఆయన జూబ్లీహిల్స్‌లోని తన ఇంటి నుంచి బయల్దేరారు. మరోవైపు.. చిక్కడపల్లిపోలీసులు ఠాణా పరిసరాల్లో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. అటువైపు ఎలాంటి వాహనాలనూ అనుమతించలేదు. పాదచారులను సైతం రానివ్వలేదు. చుట్టుపక్కల ఉన్న దుకాణాలన్నింటినీ మూయించారు. ఇనుప బారికేడ్లు ఏర్పాటు చేశారు. 11.05 గంటలకు అల్లు అర్జున్ పోలీస్ స్టేషన్‌కు చేరుకోగానే గేట్లు మూసేశారు. అల్లు అరవింద్‌ను, చంద్రశేఖర్ రెడ్డిని, బన్నీ వాసును కిందే ఆపేసిన పోలీసులు.. బన్నీని ఠాణా మొదటి అంతస్తులోని ఏసీపీ కార్యాలయంలోకి తీసుకెళ్లారు. అక్కడ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, ఏసీపీ రమేశ్, ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ బృందం.. అల్లు అర్జున్ తరఫు న్యాయవాది సమక్షంలో విచారణ ప్రారంభించారు. మధ్యాహ్నం 2:45 వరకు.. మూడున్నర గంటలపాటు ఈ విచారణ కొనసాగింది. విచారణలో భాగంగా అల్లు అర్జున్‌పై పోలీసులు ప్రశ్నల వర్షం కురిపించినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల ప్రకారం.. "ప్రీమియర్ షోకి హీరో హీరోయిన్‌లను రానివ్వొద్దంటూ పోలీసులు థియేటర్ యాజమాన్యానికి లిఖిత పూర్వకంగా తెలిపిన విషయం మీ దృష్టికి వచ్చిందా? రాలేదా? ఒకవేళ యాజమాన్యం ఆ విషయాన్ని మీ దృష్టికి తీసుకురావడంలో విఫలమైతే.. మీరు కుటుంబంతో పాటు ప్రీమియర్ షోకు వచ్చినప్పుడు నేరుగా థియేటర్‌లోకి వెళ్లకుండా బయట నుంచే ఓపెన్ టాప్ వాహనంలో నిలబడి చేతులు ఊపుతూ రోడ్‌షో ఎందుకు చేశారు? అలా చేయడానికి మీకు ఎవరు అనుమతి ఇచ్చారు? అనుమతి లేకుండా రోడ్‌షో చేయడం తప్పని మీకు తెలియదా? జరిగిన ఘోరం గురించి మీ దృష్టికి తెచ్చి.. వెంటనే అక్కణ్నుంచీ వెళ్లిపోవాలని సూచించినా ఎందుకు వెళ్లలేదు? అదే విషయాన్ని థియేటర్ యాజమాన్యం ద్వారా చెప్పించినా, స్వయంగా ఏసీపీ వచ్చి చెప్పినా మీరు ఎందుకు పట్టించుకోలేదు? మీ వల్ల జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ నిండు ప్రాణాలు కోల్పోవడంతోపాటు ఆమె కుమారుడు అపస్మారక స్థితిలోకి వెళ్లిన విషయం మీకు ఎప్పుడు తెలిసింది? ఎలాంటి అనుమతులూ లేకుండా బౌన్సర్‌లను, ప్రైవేట్ సెక్యూరిటీని థియేటర్ వద్దకు ఎలా తీసుకొస్తారు? మీతో పాటు.. మీ కోసం వచ్చి ప్రైవేట్ సెక్యూరిటీ, బౌన్సర్‌ల అత్యుత్సాహం వల్ల, థియేటర్‌లో తొక్కిసలాటకు జరుగుతుంటే మీరు ఎందుకు స్పందించలేదు?" అంటూ డీసీపీ ప్రశ్నలు సంధించారు. రేవతి చనిపోయిన విషయం తనకు ఆరోజు తెలియదని, ఇంటికి వెళ్లిన తర్వాత తన ఫోన్ బయటపెట్టి, ఉదయం వరకూ లేపవద్దని చెప్పి తాను పడుకున్నానని, బన్నీవాసకు ఆ రాత్రే ఈ విషయం తెలిసిందని, మర్నాడు ఉదయం అతని ద్వారా తమకూ తెలిసిందని అర్జున్ పోలీసులకు వివరించినట్లు తెలుస్తోంది. విచారణ సందర్భంగా పోలీసులు ఒక్కొక్క ప్రశ్నా వేస్తూ.. దానికి అల్లు అర్జున్ చెప్పిన జవాబు విని, సంబంధిత వీడియోను ఆయనకు చూపించినట్టు సమాచారం. ఉదాహరణకు.. "పోలీసు అధికారులు థియేటర్‌లో ఉన్న మీ వద్దకు రాలేదని అన్నారుగా?" అనే ప్రశ్నకు.. రాలేదని బన్నీ సమాధానమివ్వగా, 'అయితే ఇదిగో ఈ వీడియో చూడండి' అంటూ పోలీసు ఉన్నతాధికారులు థియేటర్ లోపలికి వస్తున్న వీడియోను ఆయనకు చూపించినట్టు సమాచారం. ఈ క్రమంలోనే.. అల్లు అర్జున్ థియేటర్‌కు రావడానికి ముందు నుంచీ బౌన్సర్లు వ్యవహరించిన తీరును, ఆయన గేట్లు మూసివేయాలని బౌన్సర్లకు చెప్పిన దృశ్యాలను పోలీసులు చూపించినప్పుడు.. తన వల్ల తప్పు జరిగిందని ఆయన అంగీకరించినట్లు తెలుస్తోంది. థియేటర్ నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా కారు టాప్ నుంచి ఆయన అభిమానులకు అభివాదం చేసిన వీడియోలు, ట్రాఫిక్ జామ్ వీడియోలనూ పోలీసులు చూపించారు.

# మరపురాని రాజనీతిజ్ఞుడు

(మొదటి పేజీ తరువాయి)



అనంతరం బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది కానీ మెజారిటీ సమకూరలేదు. రాష్ట్రపతి ఆహ్వానంతో వాజపేయి మే నెలలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అయితే, మెజారిటీ సంపాదించుకోలేకపోవటంతో 13 రోజుల వ్యవధిలోనే ప్రధాని పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా లోక్‌సభలో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి బదులిస్తూ.. 'పార్టీలను చీల్చి కొత్త భాగస్వాములతో కలిసి అధికారాన్ని చేపట్టటం నా లక్ష్యం కాదు. ఆ విధంగా దక్కిన అధికారాన్ని నేను కనీసం పట్టకారుతో కూడా తాకటానికి ఇష్టపడను' అంటూ వాజపేయి చేసిన ప్రసంగం ఆయన కట్టుబడిన నైతిక విలువలకు అద్దం పట్టింది. ప్రధానిగా ఆయన తొలిదఫా ప్రభుత్వమిది. అయినప్పటికీ, అనైతికమార్గాల్లో ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవటానికి వాజపేయి ఎంతమాత్రం ప్రయత్నించలేదు. రెండోసారి కూడా అంతే. రెండేళ్ల వ్యవధిలోనే 1998లో మళ్లీ లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో కూడా బీజేపీకి మెజారిటీ దక్కనప్పటికీ అతిపెద్ద పార్టీగా నిలిచింది. పలు పార్టీల మద్దతుతో కలిసి వాజపేయి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. కానీ, మరుసటి ఏడాదే అన్నాడీఎంకే కూటమి నుంచి వైదొలిగింది. విశ్వాస పరీక్షలో కేవలం ఒక్క ఓటు తేడాతో ప్రభుత్వం ఓడిపోయి.. వాజపేయి రాజీనామా చేశారు. అదే ఏడాది మళ్లీ లోక్‌సభ ఎన్నికలు జరిగాయి (రెండేళ్లలో మూడుసార్లు). ఈ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ 303 సీట్లతో మెజారిటీ సాధించి తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ ప్రభుత్వం 2004 వరకూ కొనసాగింది. కేంద్రంలో కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఐదేళ్లపాటు విజయవంతంగా నడిపించిన తొలి నేత వాజపేయి. వాజపేయి హయాంలో జరిగిన కార్గిల్ యుద్ధం.. భారత సైన్యం చరిత్రలో ఒక చరిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. 1999 మే నెలలో పాకిస్థాన్ సైనికులు, మిలిటెంట్లు కార్గిల్ పట్టణం చుట్టుపక్కల ప్రాంతాల్లో చొరబాట్లు, ఆక్రమణ ప్రారంభించారు. దీనిని తిప్పికొట్టటానికి మే నెల 26న భారత సైన్యం ఆపరేషన్ విజయ్‌ను ప్రారంభించింది. 3 నెలలపాటు జరిగిన యుద్ధంలో 500 మందికిపైగా జవాన్లు అమరులయ్యారు. పాకిస్థాన్ వైపున దాదాపు 4 వేల మంది సైనికులు, మిలిటెంట్లు మరణించినట్లు తర్వాత కాలంలో నివేదికలు వెల్లడయ్యాయి. కార్గిల్ విజయంతో వాజపేయి ప్రతిష్ఠ పెరిగిపోయింది. అదే ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు దీనికి అద్దం పట్టాయి. పూర్తి మెజారిటీతో ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చింది.

**పోఖ్రాన్ అణుపరీక్షలు**

1998 మే నెలలో వాజపేయి ప్రధానిగా ఉన్న సమయంలోనే భారత్.. రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఎడారి ప్రాంతంలో ఐదు భూగర్భ అణుపరీక్షలు నిర్వహించి ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. శత్రుదేశాల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. 1974లో భారత్ తొలి అణుపరీక్ష నిర్వహించగా.. మళ్లీ 24 ఏళ్ల తర్వాత పోఖ్రాన్‌లో ఆ పరీక్షలు జరిపి తన అణ్వాయుధ పాటవాన్ని యావత్ ప్రపంచం ఎదుట చాటిచెప్పింది. తొలుత ఆంక్షలు విధించిన అమెరికా.. అంతర్జాతీయ రాజకీయాల్లో భారత్ ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ కేవలం ఆరునెలల్లోనే వాటిని ఎత్తివేసింది. వక్తగా వాజపేయి పార్టీలకు అతీతంగా అభిమానుల్ని సంపాదించుకున్నారు. 1957లో ఎంపీగా వాజపేయి లోక్‌సభలో తొలిసారి చేసిన ప్రసంగం నాటి ప్రధాని నెహ్రూను అమితంగా ఆకర్షించింది. ఎంతగానంటే.. అప్పట్లో భారత సందర్శనకు వచ్చిన ఓ విదేశీ నేతకు ఎంపీలను పరిచయం చేస్తూ.. వాజపేయి దగ్గరికి వచ్చే సరికి 'ఈ యువకుడు ఏదో ఒకనాడు భారతదేశ ప్రధానమంత్రి అవుతారు' అని నెహ్రూ చెప్పారట. ఎమర్జెన్సీ అనంతరం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెసేతర పార్టీలన్నీ కలిసి ఏర్పాటు చేసిన జనతా ప్రభుత్వంలో వాజపేయి విదేశాంగమంత్రిగా పని చేశారు. పార్లమెంటులోని సౌత్‌బ్లాక్ నుంచి నెహ్రూ ఫొటోను తొలగించటంపై వాజపేయి అసంతృప్తి వ్యక్తం చేస్తూ తిరిగి ఆ ఫొటోను అక్కడే ఏర్పాటు చేయించారు. వాజపేయి కవి కూడా. స్వయంగా పలు కవితలు రాసిన ఆయన ప్రసంగాల్లోనూ కవితాత్మక ధోరణి కనిపించేది. 'చోటే మన్ సే కోయి బడా నహీ హోతా! టూటే మన్ సే కోయీ ఖడే నహీ హోతా!' (అల్ప బుద్ధి కలవారు గొప్ప పనులు చేయలేరు! హృదయం ముక్కలైన వారు నిటారుగా నిలబడలేరు) వంటి పంక్తులు వాజపేయి ప్రసంగాల్లో జాలు వారి శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తుండేవి. పీవీ ప్రధానిగా ఉన్న సమయంలో విపక్షనేతగా ఉన్న వాజపేయిని జెనీవాలో జరిగిన ఐక్యరాజ్యసమితి సమావేశాలకు భారత ప్రతినిధిగా పంపించారు. వాజపేయి సామర్థ్యంపై పీవీకి ఉన్న నమ్మకానికి ఇది ఒక నిదర్శనంగా భావిస్తారు. పాకిస్థాన్ సేనలతో పోరాడి బంగ్లాదేశ్ ఆవిర్భావానికి దారులు వేసిన నాటి ప్రధాని ఇందిరాగాంధీని వాజపేయి అప్పట్లో దుర్గాదేవితో పోల్చారు. దేశానికి సంబంధించిన అంశాల్లో వాజపేయి పార్టీలకతీతంగా వ్యవహరించేవారనటానికి ఇవన్నీ నిదర్శనాలు. వాజపేయి ఉత్తమ పార్లమెంటేరియన్లలో ఒకరిగా పేరుగాంచారు. ఆయన ఎల్లప్పుడూ చర్చలు, ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నాలు చేసేవారు. అధికారపక్షం విపక్షాల గొంతు నొక్కటాన్ని ఆయన సమర్థించేవారు కాదు. అలాగే, విపక్షం పార్లమెంటు కార్యకలాపాలను అడ్డుకుంటూ వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన చేపట్టటాన్నీ ఆమోదించేవారు కాదు.

# ఈనెల 26న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో దండు మోహన్ గురుస్వామి 37 వ సంవత్సర శ్రీ అయ్యప్ప స్వామి దివ్య పదు నెట్టాంబడి పూజ



**శంకర్ పల్లి డిసెంబర్ 24:(డైలీ రిపోర్ట్):** శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని బిడియల్ చౌరస్తా లో గల శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో దండు మోహన్ గురుస్వామి 37వ సంవత్సర దీక్ష పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దండు మోహన్ గురుస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తేదీ 26న గురువారం ఉదయం9-30 నిమిషములకు స్వామివారికి అభిషేకము, లక్ష పుష్పార్చన, పల్లకి సేవ, మంగళ హారతులు నిర్వహించబడతాయని తెలిపారు. మధ్యాహ్నం వచ్చిన భక్తులకు అన్నదాన వితరణ ఉంటుందని చెప్పారు. అదే రోజు సాయంత్రం5-45 గంటలకు శ్రీ అయ్యప్ప స్వామి వారి దివ్య పదునెట్టాంబడి పూజ జరుగుతుందని తెలిపారు. శ్రీ తపోవనం పీఠాధిస్వరులు శ్రీశ్రీశ్రీ సద్గురు సచ్చిదానంద సరస్వతి స్వామి వారి ఆశీస్సులతో, గురుస్వాములందరి అభినందనలతో ఈ పదునెట్టాంబడి పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని చెప్పారు.



# కేంద్ర పథకాలకు ఆకర్షితులై సానికె ప్రవీణ్ యాదవ్ ఆధ్వర్యంలో 50 మంది యువకులు బిజెపిలో చేరిక: మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

**శంకర్‌పల్లి డిసెంబర్ 24:(డైలీ రిపోర్ట్):** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువకులు బిజెపిలో చేరుతున్నారని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని అయ్యప్ప రెడ్డి గూడ, సింగపురం వార్డులకు చెందిన యువత సానికె ప్రవీణ్ ఆధ్వర్యంలో 50 మంది బిజెపిలో చేరారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ ప్రజలకు సమర్థ పాలన అందిస్తున్న బిజెపిలో చేరాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా దిశా కమిటీ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ కన్వీనర్ ప్రతాప్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రాములు గౌడ్, మున్సిపల్ ఇంచార్జ్ వాసుదేవ్ కన్న, మున్సిపల్ అధ్యక్షుడు సురేష్, ఆడెపు నర్సింలు, మున్నూరు లోకేష్, మంగలి రాము, మంగలి ప్రవీణ్, బొమ్మన్న గారి సత్యనారాయణ, కావలి మహేష్, అయ్యవారి ప్రవీణ్, చందిప్ప శేఖర్, సాయి ప్రసాద్, సతీష్, రాజశేఖర్ రెడ్డి ఉన్నారు.




# శంకర్‌పల్లి లిటిల్ స్టార్ స్కూల్ క్రిస్మస్ వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్

**శంకర్‌పల్లి డిసెంబర్ 24:(డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మున్సిపల్ లోని లిటిల్ స్టార్ హై స్కూల్లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో మున్సిపల్ చైర్ పర్సన్ సాత విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్, 14వ వార్డ్ కౌన్సిలర్ జూలకంటి శ్వేతా పాండురంగ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ప్రదర్శించిన క్రీస్తు జనన నాటక కంఠస్థ వాణ్యాలు అభినయ నృత్యాలు యోసేపు మేరీ మాత వేషధారణలు క్రీస్తు పశువుల పాక అందరిని విశేషంగా ఆకర్షించాయి. పాఠశాలలో ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. మున్సిపల్ ప్రజలకు చైర్ పర్సన్ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు జన్మదిన సందర్భంగా క్రిస్మస్ ప్రపంచానికి పెద్ద పర్వదినం అని కరుణామయుని బోధనలను అందరికీ మార్గదర్శకమని తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సంజీత్ కుమార్, ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ మాకు దేవుడితో సమానం

## తక్షణమే అమిత్ షాను బర్తరఫ్ చేయాలి: చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భీమ్ భరత్

## రావిర్యాల అంబేద్కర్ విగ్రహం నుంచి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వరకు కాంగ్రెస్ భారీ ర్యాలీ



**శంకర్పల్లి డిసెంబర్ 24:(డైలీ రిపోర్ట్):** అంబేద్కర్ తమకు దేవుడితో సమానమని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బీమ్ భరత్ అన్నారు. పార్లమెంటులో కేంద్రమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్ల నరసింహారెడ్డి సమక్షంలో రావిర్యాల అంబేద్కర్ విగ్రహం నుంచి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వరకు కాంగ్రెస్ భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. అనంతరం భీమ్ భారత్ మాట్లాడుతూ అంబేద్కర్ పేరు బీజేపీ నేతలకు ఫ్యాషన్ అయితే, తమకు మాత్రం ఆరాధ్య దైవమన్నారు. రాజ్యాం గాన్ని మార్చాలని బీజేపీ ప్రయత్నిస్తోందని, మనుస్మృతి అమలు చేసేందుకు బీజేపీ, సంఘ్ పరివార్ కుట్ర చేస్తోందని ఆరోపిం చారు. తక్షణమే అమిత్ షాను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ ను అవమానించిన బీజేపీ తీరును ప్రజాస్వామ్య రీతిలో ఎండగడుతున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయడం సిగ్గుచేటన్నారు. నిత్యం రాజ్యాంగాన్ని తప్పుపట్టే బీజేపీ నేతలు.. ఇప్పుడు అంబేద్కర్ ను కూడా తూలనాడుతున్నారని విమర్శించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి బీజేపీపై కాంగ్రెస్ పెద్దఎత్తున పోరాడుతోం దని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యులు సత్యనారాయణ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి భార్గవ్ రామ్, తోలకట్ట సత్యనారాయణ, చిలుకూరు రాజు, కుమార్, నవాబుపేట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొండల్ యాదవ్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉపేందర్ రెడ్డి, జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ సభ్యులు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ ఇన్చార్జులు, మండల పార్టీ అధ్యక్షులు, డివిజన్ పార్టీ అధ్యక్షులు, ఎన్ఎస్‌యూఐ విభాగం నాయకులు, యువజన కాంగ్రెస్ విభాగం నాయకులు, మహిళా విభాగం నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, ఎస్టి, ఎస్సి, బిసి మైనార్టీ సెల్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ సోషల్ మీడియా నాయకులు పాల్గొన్నారు.




# ఆటో,ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి





**అంతగిరి,డిసెంబర్24,(డైలీ రిపోర్ట్):** ఆటో, గడ్డివాము ట్రాక్టర్ ఢీకొని సరోజిని(40) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల పరిధిలోని ఖానాపురం గ్రామ శివారులో చోటుచేసుకుంది.. అనంతగిరి ఏఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడలో నివాసం ఉంటున్న సరోజిని తన అమ్మగారి ఇంటికి నాయకన్ గూడెం వెళ్లే క్రమంలో మార్గమధ్యలో అనంతగిరి మండల పరిధిలోని ఖానాపురం పెట్రోల్ బంకు వద్ద గడ్డివాము ట్రాక్టర్ డ్రైవర్ సురేష్ నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేయడం వల్ల ఆటోను బలంగా ఢీకొనడంతో ఆటో డ్రైవర్ కు బలమైన గాయాలు కావడం, ఆటోలో ప్రయాణిస్తున్న సరోజినీ అక్కడికక్కడే మృతి చెందడంతో సరోజినీ భర్త మల్లయ్య ఆటో డ్రైవర్ వీరబాబు ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అనంతగిరి ఏఎస్ఐ లింగారెడ్డి తెలిపారు..

# క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన: ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సంగారెడ్డి బ్యూరో డిసెంబర్ 24:(డైలీ రిపోర్ట్):** క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని క్రైస్తవులందరికీ సంగారెడ్డి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, సంగారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు చింత ప్రభాకర్ శుభాకాంక్షలు తెలియజేశారు... కరుణ, ప్రేమ, క్షమ, సహనం, దాతృత్వం, త్యాగం, ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశం... దుర్మార్గం, నుంచి సన్మార్గానికి, అమానుషత్వం, నుంచి మానవత్వానికి, చెడు, నుంచి మంచికి, దురాశ ,నుంచి భ్రాతృత్యం ,త్యాగాలకు జీసస్ బాటలు వేశారు...క్రిస్మస్ అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, అది మనిషిని నిరంతరం సన్మార్గంలో నడిపించే దైవికమైన ఒక భావన ...



# కథ చాలా కొత్తగా ఉంది: బాబీ కొల్లి

“నేను, మోహన్ కలిసి రైటర్స్‌గా పని చేశాం. తను ఈ సినిమాని వినోదంతో పాటు సస్పెన్స్ థ్రిల్లింగ్ అంశాలతో తీశాడని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. కథ చాలా కొత్తగా ఉంది. ఈ సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి” అని డైరెక్టర్ బాబీ కొల్లి అన్నారు. ‘వెన్నెల’ కిశోర్ టైటిల్ రోల్‌లో, రవితేజ మహాదాస్యం, అనన్య నాగళ్ల జంటగా, శియా గౌతమ్ కీలక పాత్రలో నటించిన చిత్రం ‘శ్రీకాకుళం షెర్లాక్ హెూమ్స్’. లాస్యా రెడ్డి సమర్పణలో వెన్నపూస రమణా రెడ్డి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నారు. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి డైరెక్టర్స్ బాబీ కొల్లి, కల్యాణ్ కృష్ణ అతిథులుగా హాజరయ్యారు. “ఈ సినిమా కంటెంట్‌ని బలంగా నమ్మాను. ఆ కథే నన్ను గెలిపిస్తుందని నమ్ముతున్నాను” అన్నారు వంశీ నందిపాటి. “నా కెరీర్‌లో చాలా మంచి పేరు తీసుకొచ్చే సినిమా ఇది” అని అనన్య నాగళ్ల పేర్కొన్నారు. “నటుడిగా ఈ చిత్రం నాకు చాలా కీలకం” అన్నారు రవితేజ మహాదాస్యం. “ఈ మూవీతో కచ్చితంగా హిట్ సాధిస్తాం” అని వెన్నపూస రమణారెడ్డి చెప్పారు.





# మార్చిలో సెట్స్‌మీదకు?

దేశవ్యాప్తంగా ‘పుష్ప-2’ అఖండ విజయంతో దూసుకుపోతున్నది. అన్ని భాషల్లో పుష్పరాజ్ హవా కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో త్రివిక్రమ్ దర్శకత్వంలో అల్లు అర్జున్ నటించబోతున్న తదుపరి సినిమాపై అభిమానుల్లో ఒక్కసారిగా ఆసక్తి పెరిగింది. ఈ సినిమా అప్‌డేట్స్ గురించి ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇక కథాంశం గురించి అనేక కథనాలు ప్రచారమవుతున్నాయి. దర్శకుడు త్రివిక్రమ్ ఈ సినిమా కోసం పీరియాడిక్ కథాంశాన్ని ఎంచుకున్నారని, పాన్ ఇండియాకు రీచ్ అయ్యేలా స్క్రిప్ట్‌కు మెరుగులు దిద్దుతున్నారని అంటున్నారు.

తాజా సమాచారం ప్రకారం మార్చిలో ఈ సినిమాను సెట్స్‌మీదకు తీసుకొస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. ‘పుష్ప-2’ రికార్డు స్థాయి వసూళ్లు, అన్ని భాషల్లో లభిస్తున్న ఆదరణ దృష్ట్యా తన సినిమాకు సంబంధించిన నటీనటుల ఎంపికపై త్రివిక్రమ్ ప్రత్యేకంగా దృష్టి పెట్టారని చెబుతున్నారు. బాలీవుడ్‌తో పాటు వివిధ భాషలకు చెందిన అగ్ర నటులను సినిమాలో భాగం చేయబోతున్నారని సమాచారం. జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి, అల వైకుంఠపురములో చిత్రాల తర్వాత త్రివిక్రమ్-బన్నీ కలయికలో రానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై యస్.రాధాకృష్ణ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు.



# దొంగగా కనిపించడం ఆనందం

“నా పదిహేనేళ్ల వయసులోనే నటిగా నా కెరీర్ మొదలైంది. ప్రేక్షకులకు వీలైనంత చేరువ కావాలని కథల ఎంపికలో ఎప్పటికప్పుడు నేను జాగ్రత్తలు తీసుకుంటుంటాను. ఇప్పటివరకు ఎన్నో భిన్నమైన పాత్రలు చేశాను. కానీ ఇప్పటివరకూ దొంగ పాత్రలో మాత్రం నటించలేదు. ఈ పాత్ర చేయాలనే నా ఆకాంక్ష ‘సికందర్ కా ముఖద్దర్’ చిత్రంతో నెరవేరినందుకు హ్యాపీగా ఉంది. నా కెరీర్‌లో ఈ పాత్ర నాకెంతో స్పెషల్” అని తమన్నా అన్నారు. జిమ్మీ షెర్గిల్, అవినాష్ తివారి, తమన్నా లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం ‘సికందర్ కా ముఖద్దర్’. నీరజ్ పాండే దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా నవంబరు 29 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా తమన్నా మాట్లాడుతూ- “నేను చేసే పాత్ర చిన్నదా? పెద్దదా అనేది నాకు ముఖ్యం కాదు. ఆ కథను ఎంత ప్రభావితం చేస్తుందన్నది ముఖ్యం.పెద్దా చిన్నా తేడాల్లేకుండా వచ్చిన అవకాశాలతో ప్రేక్షకులను మెప్పించడమే నా లక్ష్యం. అలాగే ఒకే రకంగా ఉండే స్ట్రాంగ్ ఉమన్ రోల్స్ కాకుండా... కొత్త తరహా ఉమన్ రోల్స్ చేయా లని ఉంది” అని పేర్కొన్నారు.



# అలాంటి సినిమాలు తీయొద్దు

‘గతకొంతకాలంగా మేల్ డామినేట్ స్టోరీస్ ఎక్కువగా వస్తున్నాయి. దశాబ్దాల కిందటే సమసిపోయిన పితృస్వామ్య భావాలను ప్రోత్సహించే కథాంశాలను తెరకెక్కిస్తున్నారు. అలాంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాలను సాధిస్తున్నాయి. ఈ ధోరణి మంచిది కాదు. ఇప్పుడు సమాజం అన్ని రంగాల్లో ఆధునిక ఆలోచనలతో పురోగమిస్తున్నది.అయినా ఇప్పటికీ పరిష్కారించాల్సిన సామాజిక సమస్యలున్నాయి. వాటిపై దృష్టి పెడితే సమాజ అభ్యున్నతికి సృజనాత్మక మార్గంలో సహాయం చేసినవాళ్లమవుతాం. స్త్రీకి కొంతమేరకే స్వేచ్ఛనివ్వాలనే ఆలోచనలు పురుషుల్లోని అభద్రతాభావాన్ని సూచిస్తాయి. నేటి స్త్రీలు స్వీయ నిర్ణయాలతో ముందుకెళ్తున్నారు.వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత పురుషలపై ఉంది’ అని అమీర్ వ్యాఖ్యానించారు. స్త్రీ సాధికారత ప్రధానాంశంగా ఆయన నిర్మించిన ‘లాపతా లేడీస్’ చిత్రం ప్రశంసలతో పాటు ఈ ఏడాది భారత్

# భానుమతి రామకృష్ణ సాక్షిగా..

## ఎన్టీఆర్ హీరోయిన్ ఫస్ట్ లుక్

దివంగత నందమూరి హరికృష్ణ మనవడు, నందమూరి జానకిరామ్ తనయుడు నందమూరి తారక రామారావుని హీరోగా పరిచయం చేస్తూ దర్శక, నిర్మాత వైవీఎస్ చౌదరి ఓ చిత్రాన్ని నిర్మించనున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో తెలుగమ్మాయి వీణారావు కథానాయికగా పరిచయం అవుతున్నది. శనివారం వీణారావు ఫస్ట్ లుక్‌ని ప్రొడ్యూసర్స్ సుప్రియ యార్లగడ్డ, స్వ్న దత్‌లు లాంచ్ చేశారు.ఈ సందర్భంగా ప్రదర్శించిన షో గ్లింప్స్‌లో సంప్రదాయబద్ధంగా, మోడ్రన్ అవుట్ ఫిట్స్‌లో బ్యూటీఫుల్‌గా వీణారావు దర్శనమిచ్చారు. కథ, సన్నివేశాలు, పాత్రలకు అనుగుణంగా నటించి, ప్రేక్షకుల్ని రంజింపజేయడంలో తన వంతు కృషి చేస్తానని తన అభిమాన నటి డాక్టర్ పి.భానుమతి రామకృష్ణ సాక్షిగా వీణారావు ప్రమాణం చేశారు.తెలుగమ్మాయి వీణారావు ప్రతిభావంతురాలైన కూచిపూడి డ్యాన్సర్ అని, తెరపై అద్భుతమైన నటిగా కూడా రాణించే టాలెంట్ తనకుందని, యంగ్ చాప్ ఎన్టీఆర్ ఫస్ట్‌లుక్‌కి ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన స్పందన వచ్చిందని, అలాగే వీణారావు కూడా అందరికీ నచ్చుతుందని దర్శకుడు వైవీయస్ చౌదరి ఆశాభావం వెలిబుచ్చారు.ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన నిర్మాతలు స్వప్నదత్, సుప్రియ యార్లగడ్డ చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. త్వరలో షూటింగ్ జరుపుకోనున్న ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, సాహిత్యం



Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707